సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 13 । మే । 2025



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు



రమా సహిత సత్యనారాయణ స్వామి

న్యూస్‌రీల్

అవిశ్వాస తీర్మాన సమావేశం మినిట్స్ ఇవ్వండి

కలెక్టర్‌కు తైనాల, రవిరెడ్డి వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే తైనాల, వైఎస్సార్ సీపీ నేత రవిరెడ్డి

మహారాణిపేట: జీవీఎంసీ ప్రత్యేక సమావేశం మినిట్స్ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం ఇన్‌చార్జి రవిరెడ్డి కోరారు. గత నెల 19న జరిగిన ఈ సమావేశం ప్రక్రియల మినిట్స్, వాటి ప్రతిని వెంటనే అందించాలన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న తాను రాసిన లేఖకు ఈ వినతి అనుసంధానంగా ఇస్తున్నట్లు తైనాల విజయకుమార్ పేర్కొన్నారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై అవిశ్వాస తీర్మానంపై చర్చించిన సమావేశం వివరాలు, చేపట్టిన చర్యల మినిట్స్ కాపీని అందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ విప్‌గా, తాను కోరిన పత్రాలను వీలైనంత త్వరగా అందజేయాలన్నారు. గతంలో తాము ఇచ్చిన ఫిర్యాదులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలన్నారు.

ఏయూ వీసీకి ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు ఎక్సలెన్స్ అవార్డు లభించింది. అకాడమీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ (హైదరాబాద్) అందించిన ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఆదివారం హైదరాబాదులోని ఐబీసీటీలో జరిగిన నేషనల్ టెక్నాలజీ డే కార్యక్రమంలో అందుకున్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు ఆచార్య రాజశేఖర్ అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును అందించడం పట్ల విశ్వవిద్యాలయ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

విశాఖ విద్య : ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు సెకండ్ లాంగ్వేజీ పరీక్ష జరిగింది. ఉదయం ఫస్టియర్ పరీక్షకు మొత్తం 8,730 మందికి గాను 8,312 మంది విద్యార్థులు హాజరయ్యారు. తద్వారా 95 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షకు 1,117 మందికి కాగా 1,020 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. తద్వారా 91 శాతం హాజరు శాతం నమోదైంది. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఆర్‌ఐవో మురళీధర్ తెలిపారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 13న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వీసీ హాల్, జెడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా జరుగుతాయని పేర్కొన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 3, 4వ స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 12 గంటలకు జరుగుతాయని వివరించారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ప్రగతి నివేదికతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

పర్యాటక శాఖకు 18.70 ఎకరాల కేటాయింపు

తగరపువలస: భీమిలి మండలం అన్నవరంలో బీచ్ రిసార్ట్స్ అండ్ కన్వెన్షన్ నిర్మాణం కోసం ప్రభుత్వం పర్యాటక శాఖకు 18.70 ఎకరాలను ఉచితంగా కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాత సర్వే నంబర్ 101/1 ప్రకారం ఎల్‌పీఎం నంబర్ 1333లో 15.405 ఎకరాలు, 1355లో 0.26 ఎకరాలు, 1356లో 3.036 ఎకరాలు మొత్తంగా కేటాయించారు. ప్రభుత్వం అనుమతి లేకుండా పర్యాటకశాఖ ఈ స్థలాన్ని ఇతర వ్యక్తులు, సంస్థలకు లీజుకు లేదా బదిలీ చేయకూడదని పేర్కొంది. అంతేకాకుండా ఉత్తర్వులు వెలువడిన మూడేళ్లలోపు భూమిని కేటాయించిన ప్రయోజనాలకు ఉపయోగించాలని సూచించింది. అలాగే ప్రస్తుతం ఉన్న రోడ్లకు, నీటి వనరులకు అంతరాయం కలిగించకూడదని షరతు విధించింది.

సింహగిరికి వైశాఖ పౌర్ణమి శోభ



భక్తులతో కిక్కిరిసిన వరాహ పుష్కరిణి



కోలలతో నృత్యాలు చేస్తున్న భక్తులు

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఇలవేల్పుగా పూజించే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల భక్తులు, మత్స్యకారులు కుటుంబసమేతంగా పెద్ద సంఖ్యలో సింహాచలం తరలివచ్చారు. తొలుత కొండదిగువ వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. వంటలు వండుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. కోలలతో నృత్యాలు చేస్తూ స్వామిని కీర్తించారు. గరిడీ నృత్యాలు చేశారు. మెట్ల మార్గం ద్వారా నడిచి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. స్నానమాచరించేందుకు తరలివచ్చిన భక్తులతో వరాహ పుష్కరిణి ప్రాంగణం కిక్కిరిసింది. పుష్కరిణి నుంచి అడవివరం మార్కెట్ కూడలి వరకు ఉన్న మార్గం భక్తజన సంద్రంగా మారింది. సింహగిరిపై దర్శన క్యూలు, కేశ ఖండనశాల, ప్రసాద విక్రయశాల, భక్తులతో నిండిపోయాయి. వరాహ పుష్కరిణి వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గోపాలపట్నం పోలీసులు, దేవస్థానం గార్డులు బందోబస్తు నిర్వహించారు. పుష్కరిణి మార్గంలో ఎలాంటి వాహనాలు వెళ్లకుండా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు

సత్యదేవుని ఆలయంలో వైశాఖ పౌర్ణమి పూజలు

దాబాగార్డెన్స్: ఇసుకకొండ(బాబాజీకొండ)పై కొలువైన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. వైశాఖ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజామున 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనం కోసం బారులు తీరారు. విశాఖ నగరం నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల సౌలభ్యం కోసం ఆలయ అధికారులు సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 విలువైన ప్రత్యేక దర్శనం టికెట్లను అందుబాటులో ఉంచారు. వేకువజామున 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎండ తీవ్రతతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

● ఆర్వో ప్లాంట్ల బరితెగింపు

మినరల్ దోపిడీ

- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం.. ఆర్వో ప్లాంట్లకు వరం
- భూగర్భ జలాలు, ప్రజల డబ్బులు తోడేస్తున్న జలకాసురులు
- జిల్లాలో రోజుకు 30 లక్షల లీటర్ల నీరు వృథా
- కేవలం 10 శాతం ప్లాంట్స్‌కు మాత్రమే బీఐఎస్ గుర్తింపు



నగరంలో నడుస్తున్న ఆర్వో ప్లాంట్



ప్లాంట్ నుంచి వృథాగా కాలువలోకి పోతున్న నీరు

జిల్లాలో ఉన్న ఆర్వో ప్లాంట్లు
సుమారు **1000**

ఒక రోజుకు మొత్తం ప్లాంట్లు తయారు చేస్తున్న మంచినీరు
10,00,000 లీటర్లు

ఒక రోజుకు వృథా చేస్తున్న నీరు
30,00,000 లీటర్లు

20 లీటర్ల క్యాన్ తయారీకి వృథా అవుతున్న నీరు **60** లీటర్లు

జిల్లాలో నెలకు నీటి వ్యాపారం
దాదాపు రూ. **15** కోట్లు



సాక్షి, విశాఖపట్నం : సకల జీవరాశులకు నిత్యం అవసరమైనది నీరు. తిండి లేకుండా రెండు మూడు రోజులు ఉండగలవేమో కానీ.. నీరు లేకుండా బతకడం కష్టం. వృథా అయిన నీటిని తిరిగి సంపాదించుకోవడం అసాధ్యం. అందుకే నీటిని వృథా చేయకుండా ఎంతో జాగ్రత్తగా వినియోగించాలి. జిల్లా పరిధిలో నీటి వ్యాపారం చేస్తున్న ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులకు మాత్రం కాసుల గలగలలే తప్ప.. నీటి గలగలల గురించి పట్టింపే లేదు. విచ్చలవిడిగా భూగర్భ జలాలను శక్తివంతమైన మోటార్లు పెట్టి తోడేస్తూ.. రూ.కోట్లలో నీటి వ్యాపారం చేస్తున్నారు. లీటర్ మినరల్ వాటర్ కోసం మూడు లీటర్ల నీటిని వృథా చేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటేందుకు కారణమవుతున్నారు. ఓవైపు కాంక్రీట్ జంగిల్‌లా నగరాన్ని మార్చేస్తుండటంతో చుక్కనీటిని ఒడిసిపట్టేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుండగా.. అలా ఒడిసిపడుతున్న ఒక్కో నీటి బొట్టును వాటర్ ప్లాంట్ల పేరుతో పీల్చేస్తూ జలకాసురుల్లా మారిపోతున్నారు. దీన్ని అరికట్టాల్సిన ప్రభుత్వ యంత్రాంగం కాసుల కక్కుర్తితో నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తోంది. వీటి ఏర్పాటుకు ఉన్న కొద్దిపాటి నిబంధనలు కూడా మామూళ్ల నీటిలో కొట్టుకుపోతున్నాయి.

వ్యాపారం రూ.కోట్లలో..
లంచాలు రూ.లక్షల్లో..

మంచినీటిపై నియంత్రణ లేకపోవడంతో ఇప్పుడు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. మంచినీటిని వ్యాపారంగా మలుచుకొని కొందరు రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. 20 లీటర్ల క్యాన్‌ను రూ.15 నుంచి రూ.30 వరకూ అమ్ముతున్నారు. ఒక్కో ప్లాంట్ రోజుకు రూ.5 వేల నుంచి రూ.7 వేలు వరకు వ్యాపారం చేస్తోంది. రోజుకు నగరంలో రూ.50 లక్షల నుంచి 70 లక్షల చొప్పున నెలకు రూ.15 కోట్ల వరకూ నీటి వ్యాపారం సాగుతోంది. వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే భారత ప్రమాణాల బ్యూరో(బీఐఎస్) నుంచి అనుమతులు తీసుకోవాలి. కానీ జిల్లాలోని 90 శాతానికిపైగా ప్లాంట్లు అనుమతులు లేకుండానే నడుస్తున్నాయి. అయినా అధికారులెవరూ వాటి జోలికి వెళ్లకపోవడం విస్తు చెందాల్సిన అంశం. వీటిపై చర్యలు తీసుకునేందుకు ఏ అధికారైనా వస్తే చాలు.. వారికి రూ.లక్షల్లో ముట్టజెప్పి తమ పని కానిచ్చేస్తున్నారు.

ఆ వ్యవస్థ మా పరిధిలోకి రాదు..!

జిల్లాలో ఎక్కువ శాతం జీవీఎంసీ పరిధే ఉంది. దీంతో ఆర్వో ప్లాంట్లు తమ పరిధిలోకి రావంటూ టౌన్ ప్లానింగ్, నీటిసరఫరా, రెవెన్యూ విభాగాల అధికారులు తప్పించుకుంటున్నారు. అయితే తమ పరిధిలో ఉన్న ఆర్వో ప్లాంట్ల నుంచి వసూళ్లకు మాత్రం ఆయా జోన్లలో ఉన్న మూడు విభాగాల సిబ్బందీ సిద్ధమైపోతున్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు కూడా ఇదే తీరుగా వ్యవహరిస్తున్నారు. నెలవారీ మామూళ్ల మాదిరిగా వసూలు చేసుకుంటూ.. ఆర్వో ప్లాంట్లలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఈ కారణంగానే ఆర్వో ప్లాంట్ వ్యాపారుల దందా పెరిగిపోతూ వస్తోంది.

లీటర్ నీటికి 3 లీటర్ల వృథా

ఇంట్లో ఉన్న కుళాయి నుంచి చుక్క నీటి బొట్టు వృథాగా పోతుంటే విలవిల్లాడిపోతుంటాం. ఆ వృథాని అరికట్టేందుకు నానా తంటాలు పడుతుంటాం. కానీ వాటర్ ప్లాంట్‌లో మంచినీటి క్యాన్లను కొనుగోలు చేస్తున్నారు కదా.. అవి తయారయ్యేందుకు ఎంత నీరు వృథా అవుతుందో ఓసారైనా ఆలోచించారా..? ఆర్వోప్లాంట్‌లో ఒక లీటరు నీటిని శుద్ధి చేసి మంచినీటిగా తయారు చెయ్యాలంటే 3 లీటర్ల నీరు వృథా అవుతుంది. ఒకప్పుడైతే లీటరు నీటికి 6 లీటర్లు వృథా అయ్యేది. ఇప్పుడు టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో 3 లీటర్లు మాత్రమే వృథా అవుతోంది. అంటే ప్రతి ఇంటికి తీసుకొస్తున్న 20 లీటర్ల క్యాన్లో మంచినీరు తయారీకీ 60 లీటర్ల నీరు వ్యర్థ జలాల్లో కలిసిపోతోంది. ఈ లెక్కన జిల్లా పరిధిలో దాదాపు 1000 ప్లాంట్‌లు ఉన్నాయి. రోజుకు సుమారు 10 లక్షల లీటర్ల నీటిని తయారు చేస్తున్నారు. ఇందుకోసం 30 లక్షల లీటర్ల నీరు మురుగు కాల్వలో కలిసిపోతోంది. ఇలా కోట్ల లీటర్ల నీటిని తోడేస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. సాధారణంగా నగరంలో 3 మీటర్లలో భూగర్భ జలాలుండాల్సి ఉండగా.. ప్రస్తుతం 9.50 మీటర్ల లోతుకు చేరి అథమ స్థాయికి చేరుకొని ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

కూటమి పాలనలో

కుట్రలు, వేధింపులే..



నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న పార్టీ నాయకులు

- మహిళలకు రక్షణ కరువు
- మండిపడ్డ వైఎస్సార్ సీపీ శ్రేణులు
- మాజీ మంత్రి రజని, ఎంపీటీసీపై పోలీసుల దాడిని నిరసిస్తూ ఆందోళన

డాబాగార్డెన్స్: యావత్ ప్రపంచమంతా భారత్-పాక్ యుద్ధంపైనే చర్చించుకుంటుంటే.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మాత్రం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడమే ధ్యేయంగా పాలన సాగిస్తోందంటూ వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మండిపడ్డారు. మాజీ మంత్రి విడదల రజని, దళిత ఎంపీటీసీ కల్పనపై పోలీసుల దాడిని నిరసిస్తూ సోమవారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నోటికి నల్ల రిబ్బన్లు ధరించి పెద్ద సంఖ్యలో మహిళలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వ దాడులు నానాటికీ పెచ్చుమీరుతున్నాయన్నారు. పార్టీ కార్యకర్తను పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి విడదల రజని పట్ల సీఐ సుబ్బరాయుడు దురుసుగా ప్రవర్తించడం చూస్తుంటే రాష్ట్రంలో ఎటువంటి పరిస్థితులు ఉన్నాయో అర్థమవుతుందన్నారు. చంద్రబాబూ.. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధిచెబుతారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేకే కుట్రలకు దిగుతున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్స్ వద్ద పెద్ద ఎత్తున మహిళలు నిరసన తెలుపుతున్నారంటే కూటమి పాలన ఏ విధంగా సాగుతుందో ఇట్టే అర్థమవుతోందన్నారు. పోలీసులు ఓ మాజీ మంత్రిపై ప్రవర్తించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, రాష్ట్ర డీజీపీ ఈ ఘటనకు బాధ్యత వహించాలన్నారు. అధికారులు చర్యలు తీసుకునే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

పార్టీ మహిళా నాయకులు పేడాడ రమణికుమారి, పల్లా చినతల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలపై దాడులు పెరిగాయన్నారు. మాజీ మంత్రిపై దురుసుగా ప్రవర్తించిన సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు బోని శివరామకృష్ణ మాట్లాడుతూ దళిత ఎంపీటీసీ కల్పనాపై కూటమి ప్రభుత్వం విరుచుకుపడడంపై తీవ్రంగా మండిపడ్డారు. చంద్రబాబుకి దళితులంటే చులకనగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగ అధ్యక్షులు బొల్లవరపు జాన్‌వెస్లీ, పేర్ల విజయ్ చంద్ర, పార్టీ ముఖ్య నేతలు గొలగాని శ్రీనివాస్, కొండా రాజీవ్‌గాంధీ, ఉడా రవి, నడింపల్లి కృష్ణంరాజు, డాక్టర్ జహీర్ అహ్మద్, పోతిన హనుమంత్, అల్లు శంకరరావు, ద్రోణంరాజు శ్రీవత్సవ్, ససపల రవీంద్రభరత్, కర్రి రామారెడ్డి, మారుతీ ప్రసాద్, దేవరకొండ మార్కండేయలు, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, శశికళ, బిపిన్ కుమార్ జైన్, అనుబంధ సంఘాల నాయకులు మహ్మద్ షరీఫ్, వాసు గౌడ్, దేవరకొండ మార్కండేయలు, కనకల ఈశ్వర్, ఇమంది సత్యనారాయణ, పద్మ శేఖర్, వాసుపల్లి బంగారమ్మ, చిత్రాడ వెంకటరమణ, కంట్రెడ్డి రామన్నపాత్రుడు, జీలకర్ర నాగేంద్ర, అంబటి శైలేష్, శ్రీదేవి వర్మ, సత్యాల సాగరిక, రోజా రాణి, శిరీష, మోహన్‌రావు, రీసు అనురాధ, బి గోవింద్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

గురువులకు సర్దుపోటు!

- ఉపాధ్యాయుల్లో బదిలీల గుబులు
- ఉమ్మడి జిల్లాలో భారీగా సర్‌ప్లస్ టీచర్లు
- మోడల్ స్కూళ్లకు హెచ్‌ఎంలుగా ఎస్‌ఏలు
- సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు గండం



విశాఖ విద్య : ఉపాధ్యాయుల బదిలీలకు నేడో, రేపో ఉత్తర్వులు వెలువడనున్న నేపథ్యంలో స్కూళ్లలో ఎక్కడెక్కడ ఏ పోస్టులు ఖాళీ ఉన్నాయనే లెక్క తీసే పనిలో జిల్లా విద్యాశాఖ యంత్రాంగం తలమునకలై ఉంది. మంగళవారం నాటికి వాస్తవ ఖాళీలను ధ్రువీకరించాలనే ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎంఈవోలు, డీఈవో కార్యాలయ సిబ్బంది అంతా ఇదే పని లో నిమగ్నమయ్యారు. ఎంఈవోలను తన కార్యాలయానికి పిలిపించి.. వారి సమక్షంలోనే వాస్తవ ఖాళీ లను లెక్క తీసి, వాటిని ధ్రువీకరించేలా డీఈవో ప్రేమ్‌కుమార్ దృష్టి సారించారు. దీంతో సోమవారం రాత్రి కూడా డీఈవో కార్యాలయంలోనే అధికారులు, సిబ్బంది క్షణం తీరిక లేకుండా విధులు నిర్వహించారు.

జిల్లాలో ఏడు రకాల బడులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోను రద్దు చేసి, దానికి ప్రత్యామ్నాయంగా జిల్లాలో ఏడు రకాల బడులు ఏర్పాటుకు అంతా సిద్ధం చేసింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 3,158 పాఠశాలలు ఉండగా ఇక్కడి పరిస్థితుల దృష్ట్యా ఏడు రకాలుగా బడులు(ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక, మోడల్ ప్రాథమిక, యూపీ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, హైస్కూల్ ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు) కూర్పు చేసి ఇక్కడి అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. 2024 డిసెంబర్ నాటికి స్కూళ్లలో నమోదైన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను లెక్క కట్టి, ఇందుకనుగుణంగానే ఖాళీల జాబితాలను సిద్ధం చేశారు.

ఎస్జీటీ పోస్టుల్లో ఎస్‌ఏలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారుగా 596 మోడల్ ప్రాథమిక స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను కేటాయిస్తున్నారు. కాగా వీటిలో ప్రధానోపాధ్యాయుడిగా స్కూల్ అసిస్టెంట్‌ను నియమించనున్నారు. దీంతో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు గండిపడే అవకాశం ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు.

హైస్కూళ్లలో భారీగా సర్‌ప్లస్ టీచర్లు

కొత్తగా ఏర్పాటు కాబోయే స్కూళ్లకు అనుగుణంగా పోస్టులు రేషనలైజేషన్ చేపట్టగా, హైస్కూళ్లలో భారీగా మిగులు ఉపాధ్యాయులు లెక్క తేలారు. గణితం, ఫిజికల్ సైన్సు, ఇంగ్లిష్ పోస్టుల్లో పనిచేసే వారే ఎక్కువగా మిగులుగా తేలారు. తాజా లెక్కల ప్రకారం సుమారుగా 234 మంది స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ కాబోతున్నారు. వీరందరినీ మోడల్ ప్రాథమిక స్కూళ్లలో సర్దుబాటు చేసేలా కసరత్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల్లో ఆందోళన

రేషనలైజేషన్ ప్రక్రియతో ఉపాధ్యాయుల్లో గుబులు మొదలైంది. బదిలీలకు అంతా సిద్ధం చేస్తున్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో భారీగా సర్‌ప్లస్‌లో ఉపాధ్యాయులు ఉండటంతో.. బదిలీల్లో ఎక్కడికి స్థానభ్రంశం కలుగుతుందోనని ఆందోళన ఉపాధ్యాయుల్లో మొదలైంది. రేషనలైజేషన్ మేరకు ఏ పోస్టులు పోతున్నాయి? ఏ పోస్టులు మిగులుతున్నాయనేది డీఈవో కార్యాలయ అధికారులు ఎప్పుడు ప్రకటిస్తారని ఉపాధ్యాయులంతా వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

పేదోళ్లం సార్..

- చదువుకోవడానికి కాస్త చోటివ్వండి
- ఏయూ విద్యార్థుల వేడుకోలు
- కనికరం చూపని వర్సిటీ అధికారులు
- హాస్టళ్లు ఖాళీ చేయాలని స్పష్టీకరణ



వర్సిటీ రెక్టార్ కిశోర్ బాబు, అధికారులను వేడుకుంటున్న విద్యార్థులు

విశాఖ విద్య: 'ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీల్లో చదువుకుంటూనే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాం. డీఎస్సీ, కానిస్టేబుల్, నెట్, సెట్‌లలో విజయం సాధించాలనే పట్టుదలతో ముందుకెళ్తున్నాం. ఈ దశలో హాస్టళ్లు ఖాళీ చేసి వెళ్లిపొమ్మంటే ప్రిపరేషన్ దెబ్బతింటుంది. పేదోళ్లమైనందున.. ఇళ్ల వద్ద చదువుకునేందుకు అనువైన వాతావరణం లేదు. మాపై కరుణ చూపి, పోటీ పరీక్షలు ముగిసేంత వరకైనా వసతి కల్పించండి. వసతి ఉంటే.. ఏదో ఒకటి తినైనా లక్ష్యాన్ని సాధిస్తాం. దయ చేసి ఏయూలో చదువుకోవడానికి చోటివ్వండి సార్.' అంటూ విద్యార్థులు చేతులు జోడించి వర్సిటీ అధికారులను వేడుకున్నారు. అయినప్పటికీ.. వర్సిటీ అధికారులు ఏమాత్రం కనికరించలేదు. తక్షణమే హాస్టళ్లు ఖాళీ చేసి వెళ్లకపోతే చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు.

మూడు సార్లు మొరపెట్టుకున్నా..

ఏయూలో చదువుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఏటా వేసవిలో వసతి కల్పిస్తున్నారు. అయితే నూతన వైస్ చాన్సలర్ వచ్చిన నాటి నుంచి వర్సిటీలో జరుగుతున్న పరిణామాలను గమనించిన విద్యార్థులు.. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తమకు వేసవి సెలవుల్లో వసతి కల్పించాలని విభాగాధిపతులకు విన్నవించారు. కానీ వర్సిటీ అధికారుల నుంచి సానుకూలమైన నిర్ణయం రాకపోవడంతో వీసీని కలిసేందుకు పోటీ పరీక్షార్థులు ప్రయత్నించారు. కానీ వారికి వీసీ అపాయింట్‌మెంట్ దొరకలేదు. మూడు సార్లు మొరపెట్టుకున్నా వర్సిటీ అధికారులు తమ సమస్యను ఏమాత్రం పట్టించుకోలేదు. దీనికి నిరసనగా సోమవారం సుమారు 50 మందికి పైగా విద్యార్థులు వీసీ భవనం ముందు బైఠాయించారు. పోటీ పరీక్షలు ముగిసేంత వరకు తమకు వర్సిటీ హాస్టళ్లలో వసతి కల్పించాలని నినదించారు.

ఇదేం పాలన?

వీసీ భవనం ముందు విద్యార్థులు బైఠాయించిన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే.. చర్యలు తీసుకుంటామంటూ పోలీసులు హెచ్చరించడంతో విద్యార్థులు కోపోద్రిక్తులయ్యారు. మేమన్నా దొంగలమా? చదువుకోవడానికి చోటివ్వండి అని అడగడం కూడా తప్పేనా? ఇదేం పాలన? ఇదే వర్సిటీలో చదువుకున్న వైస్ చాన్సలర్.. విద్యార్థుల పట్ల ఎందుకిలా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదంటూ పలువురు విద్యార్థులు పోలీసుల ఎదుట వాపోయారు. వేసవి సెలవులు ఇచ్చినా.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి మినహాయింపు ఇచ్చి, హాస్టళ్లలో ఉండనిచ్చేవారు. గతేడాది వరకు ఇదే జరిగింది. వర్సిటీ అధికారులు ఇప్పుడెందుకు ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు. యూనివర్సిటీ నుంచి విద్యార్థులను బయటకు పంపించేయడమే ప్రస్తుత పాలకుల లక్ష్యమా? అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

హాస్టళ్లు ఖాళీ చేయకుంటే చర్యలు తీసుకుంటాం

విద్యార్థులు వీసీ భవనం ముందు బైఠాయించడంతో వర్సిటీ రెక్టార్ కిశోర్ బాబు, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజు తదితరులు అక్కడకు చేరుకుని వారితో చర్చించారు. అయితే వైస్ చాన్సలర్ వచ్చి సమాధానం చెప్పాలని విద్యార్థులు పట్టుబట్టారు. వీసీ ప్రతినిధిగానే తాము వచ్చామని, హాస్టళ్లు ఖాళీ చేయాల్సిందేనని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమను ఎదురించి మాట్లాడితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని.. మీరన్న మాటల వీడియోలు ఉన్నాయంటూ హాస్టల్ వ్యవహారాలు చూసే ఓ అధికారి బెదిరింపు ధోరణితో మాట్లాడారు. దీంతో చేసేది లేక విద్యార్థులు అక్కడ నుంచి వెనుదిరిగారు.

'పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోండి'

మహారాణిపేట: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'మై భారత్' వేదికగా పౌర రక్షణ వలంటీర్లుగా యువత నమోదు చేసుకోవచ్చు. అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో పౌరులు కీలక పాత్ర పోషించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ప్రజా అత్యవసర పరిస్థితులు, ఇతర ఊహించని పరిస్థితుల్లో సేవలందించేందుకు స్వచ్ఛంద దళాన్ని తయారు చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు తెలిపారు.

అర్జీల రీ ఓపెన్‌పై అసంతృప్తి

- పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌లో 208 వినతుల స్వీకరణ


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో నమోదైన అర్జీలు తరచూ పునరావృతం అవుతుండటంపై కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో ఆయన వినతులపై సమీక్షించారు. ప్రజల నుంచి అందిన అర్జీలను 24 గంటలలోపు తెరిచి, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు అర్జీదారులతో స్వయంగా మాట్లాడి.. సమస్య పూర్వాపరాలు తెలుసుకుని సరైన పరిష్కారం అందించాలని స్పష్టం చేశారు. అర్జీలు పునరావృతం అయితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కార్యాలయాల నుంచి వచ్చే అర్జీలకు, ముఖ్యంగా భూసర్వే, రెవెన్యూ, జీవీఎంసీలకు సంబంధించిన వాటికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి తక్షణమే పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 208 వినతులు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు 80, పోలీసు శాఖకు 19, జీవీఎంసీకి 52, ఇతర విభాగాలకు 57 అర్జీలు వచ్చాయి. ప్రజా సమస్యల స్థితిని తెలుసుకోవడానికి లేదా కొత్త ఫిర్యాదులు నమోదు చేయడానికి 1100 కాల్ సెంటర్‌ను ఉపయోగించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అలాగే పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 120 వినతులు వచ్చినట్లు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు.

అమరావతిలోనే అభివృద్ధి కేంద్రీకరణ

- మిగతా ప్రాంతాల అభివృద్ధి పట్టదా..
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం : కూటమి ప్రభుత్వం అమరావతినే అభివృద్ధి చేస్తూ మిగతా ప్రాంతాలను విస్మరించడాన్ని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి తప్పుపట్టారు. అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అమరావతి కోసం ఇప్పటికే 40 వేల ఎకరాలు సేకరించారని, మరో 40 వేల ఎకరాలు సేకరిస్తున్నారని, అక్కడ ప్రభుత్వం చేస్తున్న భూ కేటాయింపులకు అర్థం లేదని విమర్శించారు. గన్నవరం విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తుండగా అక్కడకు దగ్గరలోని అమరావతిలో మరో అంతర్జాతీయ విమానాశ్రయానికి 4 వేల ఎకరాలు కేటాయించడాన్ని తప్పుపట్టారు. అమరావతిలో రైల్వే స్టేషన్ కోసం 2,600 ఎకరాలు కేటాయించారని, దేశంలో ఏ రైల్వే స్టేషన్ చూసినా వంద ఎకరాలలోపే ఉన్నాయన్నారు. విశాఖ కేంద్రంగా ఐటీని అభివృద్ధి చేస్తామని చెప్పి అమరావతిలో ఐకానిక్ టవర్లను నిర్మిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం విశాఖలో టీసీఎస్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుని, ఎకరం 99 పైసలకు భూములను కేటాయించారన్నారు. టీసీఎస్ ఎప్పుడు కార్యకలాపాలు ప్రారంభిస్తుందో తెలియదన్నారు. విశాఖలో ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సంస్థకు భూములు కేటాయించారని, అక్కడ మౌలిక సదుపాయాల కోసం భారీగా నిధులు ఖర్చు చేశారని, ఇప్పటి వరకు ఆ సంస్థ పునాది రాయి కూడా వేయలేదని విమర్శించారు. 2026లో భోగాపురం విమానాశ్రయం కార్యకలాపాలు ప్రారంభమవుతాయని విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించినప్పటికీ, విమానాశ్రయాన్ని అనుసంధానం చేస్తూ రహదారులను ఇప్పటి వరకు అభివృద్ధి చేయలేదన్నారు. విశాఖ మెట్రో కారిడార్ పై కేంద్రం నుంచి ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన లేదని అన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

జిల్లా కార్యవర్గం, నూతన సమితి ఎన్నిక

జిల్లా కార్యదర్శిగా ఎస్.కె.రెహమాన్, జిల్లా సహాయ కార్యదర్శిగా కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా ఎం.పైడిరాజు, కె.సత్యాంజనేయ, ఆర్.శ్రీనివాసరావు, ఎం.మన్మథరావు, సి.ఎన్.క్షేత్రపాల్ రెడ్డి, కె.వనజాక్షి, ఎస్.నాగభూషణం పాటు మొత్తం 33 మందితో నూతన సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కలుషిత నీటితో అనారోగ్యం



దివీస్ పరిశ్రమ కారణంగా చుట్టుపక్కల 40 గ్రామాల్లో తాగునీరు కలుషితమవుతోంది. ఈ నీటిని తాగడం వల్ల ప్రజలు తరచుగా అనారోగ్యాల బారిన పడుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా వెంటనే సురక్షితమైన తాగునీటిని అందించాలి.

– బి.నరసింగరావు, కొండపేట, భీమిలి మండలం

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి



ఆనందపురం మండలం మామిడిలోవలో సర్వీస్ ఇనాం సర్వే నెంబర్ 33/1 నుంచి 14 వరకు 30 ఎకరాల 30 సెంట్లు భూమి మా పూర్వీకులైన నరసింహపాత్రుడు, సీతారాం పాత్రుడు పేరిట ఉండేది. ఈ భూములను కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకుని వారి పేర్ల మీద మార్పు చేసుకున్నారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయించి, మా భూములను తిరిగి ఇప్పించాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కొన్నేళ్లుగా తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. మా కుటుంబానికి న్యాయం చేసి.. తాతల కాలం నుంచి వస్తున్న ఆ భూములను తిరిగి ఇప్పించాలి.

– పిళ్లా పాపయ్య పాత్రుడు, మామిడి లోవ, ఆనందపురం మండలం

మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు


చింతలపూడి లావణ్య వెంకట సత్యకుమార్, కొండపల్లి తరుణ్

అక్కిరెడ్డిపాలెం: మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివి.. గాజువాకకు చెందిన చింతలపూడి లావణ్య వెంకటసత్యకుమార్, కొండపల్లి తరుణ్ వద్ద 2.4 గ్రాముల ఎండీఎంఏ మత్తు పదార్థాలు ఉన్నాయని, వారు ఆటోనగర్ వద్ద ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు దాడి చేసి, వారి నుంచి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి మత్తు పదార్థాలను తీసుకువచ్చి స్థానికంగా విక్రయిస్తున్నట్లు విచారణలో యువకులు అంగీకరించారని పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టు ఆదేశాల మేరకు వారిని రిమాండ్‌కు తరలించారు.

బి.వి.రామ్‌పై టీడీపీ నాయకుల దాడి

గాజువాక : గాజువాకలో కొంతమంది టీడీపీ నాయకులు తనపై దాడి చేశారని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తెలిపారు. తనపై దారుణంగా దాడి చేసి, తన దుస్తులు చింపేశారని పేర్కొన్నారు. తనను చంపడానికి ప్రయత్నించారని ఆరోపించారు. దీనిపై చంద్రబాబుతోనే తేల్చుకుంటానని పేర్కొన్నారు. కాగా, ఈ విషయంపై గాజువాక సీఐ పార్థసారథిని సంప్రదించగా, తనను కొట్టినట్టు బి.వి.రామ్ తెలిపారని, అయితే, దీనిపై ఆయన ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోయారని చెప్పారు.

జీవీఎంసీకి 88 వినతులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ శ్రీనివాస్

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 88 వినతులు అందాయి. మేయర్ పీలా శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. నిర్ణీత సమయంలో ఈ ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత అధికారులను మేయర్ ఆదేశించారు. కాగా.. పరిపాలన అండ్ అకౌంట్స్ విభాగానికి 9, రెవెన్యూకి 7, పబ్లిక్ హెల్త్‌కు 7, పట్టణ ప్రణాళికా విభాగానికి 43, ఇంజినీరింగ్ సెక్షన్‌కు 18, యూసీడీ విభాగానికి 3, మొక్కల విభాగానికి ఒక ఫిర్యాదు అందింది. ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాదరాజు, చీఫ్‌సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, డీసీఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాలూరు శ్యామలాంబ జాతరకు 100 బస్సులు

ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు


ఉత్తమ కండక్టర్‌కు చెక్ అందిస్తున్న ఆర్ఎం

మద్దిలపాలెం: సాలూరు శ్రీ శ్యామలాంబ అమ్మవారి జాతరకు ఏపీఎస్ఆర్టీసీ భారీ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న ఈ జాతర కోసం సుమారు 100 ప్రత్యేక బస్సు సర్వీసులను కేటాయించినట్లు ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ అప్పలనాయుడు వెల్లడించారు. మద్దిలపాలెంలోని సిటీ బస్ డిపోను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరులో జరుగుతున్న శ్రీ మోదకొండమ్మ జాతర కోసం 20 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. బస్సులన్నీ మంచి కండిషన్‌లో ఉండేలా చూసి.. రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మద్దిలపాలెం డిపోలో ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణ కుమారి, అసిస్టెంట్ ఇంజనీర్ బిందు, అసిస్టెంట్ మేనేజర్ మాధురి, స్టేషన్ మేనేజర్ మూర్తి, సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ ధర్నా


డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

విశాఖ విద్య: పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, బదిలీలు, ఉపాధ్యాయుల ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం డీఈవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్ మాట్లాడుతూ ఏ విధమైన స్పష్టమైన జీవోలు లేకుండా రోజుకో ఆలోచనతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అందరిలో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. సమస్యలపై ఉపాధ్యాయుల ఆందోళనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పరిష్కారం లభించలేదన్నారు. బదిలీలు, పదోన్నతులు, పునర్ వ్యవస్థీకరణకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 15న విజయవాడలోని విద్యాభవన్‌ను వేలాది మంది ఉపాధ్యాయులతో ముట్టడిస్తామన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ కుమార్ వినతి పత్రం అందజేశారు. అదే విధంగా కలెక్టరేట్ అధికారులకు కూడా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు చుక్క సత్యం, రిజ్వాన్, టి.జగన్, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండో విడత చందనం సమర్పణ


శిరస్సున చందనంతో అప్పన్న ఉత్సవమూర్తి

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం రెండో విడత చందనం సమర్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి పూజలు నిర్వహించారు. అనంతరం మూడు మణుగుల పచ్చి చందనాన్ని శాస్త్రోక్తంగా సమర్పించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థానమండపంలో అధిష్ఠించి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి చందనం సమర్పణ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సీపీ పేరుతో దందా..!

- సైబర్ సెక్యూరిటీలో ఉద్యోగం ఇప్పిస్తానని సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి రూ.7.5 లక్షల టోకరా
- కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు పవన్‌కుమార్
- అయినా ఫలితం శూన్యం.. కమిషనరేట్ చుట్టూ తిరుగుతున్నా జరగని న్యాయం
- మాకు చెప్పి ఇచ్చావా? అంటూ బాధితుడిపై సిబ్బంది సీరియస్

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలుసని చెప్పాడు. అతనికి చెప్పి సైబర్ సెక్యూరిటీ వింగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ.7.5 లక్షలు వరకు కాజేశాడు. ఉద్యోగం రాకపోవడంతో బాధితుడు సీపీని ఆశ్రయించినప్పటికీ న్యాయం జరగలేదు. కమిషనరేట్ చుట్టూ తిరుగుతుంటే.. మాకు ఇచ్చావా? మాకు చెప్పి ఇచ్చావా? సివిల్ కేసు ఇది.. బయట తేల్చుకో.. పో.. అంటూ బాధితుడిపై పోలీసులు సీరియస్ అయ్యారు. ఇదీ విశాఖ పోలీసుల పనితీరు. వివరాల్లోకి వెళితే.. అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన పవన్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతడికి అదే ప్రాంతంలో ఉన్న యూట్యూబ్ నిర్వాహకుడు పరిచయం అయ్యాడు. ఒక రోజు సదరు యూట్యూబర్ పోలీస్ కమిషనరేట్‌లో సైబర్ సెక్యూరిటీ వింగ్‌లో ఖాళీలు ఉన్నాయని పవన్‌కు చెప్పాడు. తనకు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చాలా క్లోజ్ అని నమ్మించాడు. తనతో మాట్లాడి ఉద్యోగం ఇస్తానని చెప్పాడు. ఇందుకు అక్కడ సిబ్బందికి కొంత ఖర్చు చేయాల్సి ఉంటుందన్నాడు.

సీపీని పలుమార్లు కలిసి..

అప్పటికీ పవన్ యూట్యూబర్ మాటలు నమ్మలేదు. వెంటనే డబ్బు ఇవ్వలేదు. దీంతో యూట్యూబర్ తెలివిగా పలుమార్లు సీపీ కార్యక్రమాలకు పవన్‌ను తీసుకువెళ్లాడు. సీపీ పాల్గొన్న ఒక కార్యక్రమంలో వేదికను సైతం పంచుకున్నాడు. పవన్ ఎదురుగా సీపీతో కలివిడిగా మాట్లాడాడు. దీంతో యూట్యూబర్‌కు సీపీతో మంచి పరిచయం ఉందని విశ్వసించిన పవన్ డబ్బులు ఇచ్చేందుకు అంగీకరించాడు.

రూ.7.5 లక్షలు కాజేత

ముందు పవన్ తన వద్ద డబ్బు లేదని యూట్యూబర్‌కు చెప్పాడు. దీంతో అతడు తన వద్ద ఉన్న డబ్బుతో పాటు బైక్‌ను తాకట్టు పెట్టి రూ.2 లక్షలు తీసుకువచ్చానని, దాన్ని పోలీస్ సిబ్బంది ఇచ్చినట్లు పవన్‌ను నమ్మించాడు. తరువాత ఆ డబ్బు పలు దఫాలలో యూట్యూబర్‌కు అందజేశాడు. అంతే కాకుండా వాయిదాల పద్ధతిలో సుమారు రూ.7.5 లక్షల వరకు పవన్ నుంచి వసూలు చేశాడు. నెలలు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో పవన్‌కు అనుమానం వచ్చింది. దీనిపై ఆరా తీయగా మోసపోయినట్లు ఆలస్యంగా గ్రహించాడు.

డబ్బు మాకిచ్చావా?

తనకు న్యాయం చేయాలని కమిషనరేట్ చుట్టూ తిరుగుతున్న పవన్‌తో పోలీసులు ప్రవర్తించిన తీరుతో ఖంగుతిన్నాడు. ముందు డబ్బు ఇప్పిస్తామని, యూట్యూబర్‌తో బైండోవర్ కూడా రాయించిన పోలీసులు.. తరువాత మాట మార్చేశారు. తనకు డబ్బు ఇప్పించాలని వెళ్లిన పవన్‌తో.. 'డబ్బు మాకిచ్చావా? మాకు చెప్పి ఇచ్చావా? ఇది సివిల్ కేసు. బయటకు వెళ్లి తేల్చుకో'.. అంటూ ఖరాఖండిగా చెప్పేశారు. దీంతో బాధితుడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయంలో పడిపోయాడు. సీపీ పేరు చెప్పి కమిషనరేట్‌లో ఉద్యోగం పేరుతో డబ్బు వసూలు చేసి మోసం చేస్తే.. సివిల్ కేసు అని.. తమకు సంబంధం లేదని చేతులు దులుపుకోవడం గమనార్హం.

సీపీకి ఫిర్యాదు చేసినా..

పవన్‌కుమార్ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వాట్సాప్ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేశాడు. వెంటనే సీపీ బాగ్చి.. పవన్‌ను పిలిచి విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. దీనిపై విచారించి బాధితుడికి న్యాయం చేయాలని ఏసీపీ వెంకట్రావుకు అప్పగించారు. దీంతో ఏసీపీ యూట్యూబర్‌ను పిలిపించి మందలించి, డబ్బు వెంటనే సెటిల్ చేయాలని హెచ్చరించాడు. నెల రోజుల్లో డబ్బు ఇచ్చేస్తానని రాతపూర్వకంగా రాసి ఇచ్చాడు. పవన్‌కు చెక్కు కూడా అందజేశాడు. అయితే ఇచ్చిన చెక్కు బౌన్స్ అయింది. దీంతో మళ్లీ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ వ్యవహారాన్ని ప్రీ లిటిగేషన్ కౌన్సెలింగ్ ఫోరం(పీఎల్‌సీఎఫ్)కు రిఫర్ చేశారు. అయినప్పటికీ న్యాయం జరగలేదు. ఎప్పటికప్పుడు పవన్ కమిషరేట్ చుట్టూ తిరుగుతున్నాడు.

వరాహ పుష్కరిణిలో పడిన బాలిక

అపోలో ఆసుపత్రిలో చికిత్స

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణిలో సోమవారం 11 ఏళ్ల బాలిక ప్రమాదవశాత్తు పడి తీవ్ర అస్వస్థతకు గురైంది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలివి.. విజయనగరం జిల్లా చెల్లూరు సమీపంలోని బడుకొండపేటకు చెందిన పల్లి అప్పలనాయుడు కుటుంబ సభ్యులతో పాటు సుమారు 100 మంది గ్రామస్తులు సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పుష్కరిణిలో స్నానం చేయడానికి వచ్చారు. ఈ క్రమంలో అప్పలనాయుడు కుమార్తె ధరణశ్రీ, మరో ఇద్దరు చిన్నారులతో కలిసి స్నానానికి దిగి అకస్మాత్తుగా నీటిలో పడిపోయింది. అక్కడే ఉన్న దేవస్థానం గజ ఈతగాళ్లు వెంటనే బాలికను బయటకు తీశారు. అయితే అప్పటికే ధరణశ్రీ నీరు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే అడవివరం ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన తర్వాత కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని సూచించారు. దేవస్థానం ఉద్యోగులు ఆమెను నగరంలోని అపోలో ఆసుపత్రికి తరలించగా.. ప్రస్తుతం అక్కడ చికిత్స జరుగుతోంది. ధరణశ్రీ కోలుకుంటోందని వైద్యులు చెప్పినట్లు ఆమె తండ్రి అప్పలనాయుడు తెలిపారు. దేవస్థానం ఈవో సుజాత, ఇన్‌చార్జి డీఈ హరి తదితరులు ఆసుపత్రికి వెళ్లి బాలిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వరాహ పుష్కరిణి వద్ద కిక్కిరిసిన భక్తులను నియంత్రించడంలో నిర్లక్ష్యం వల్లే బాలిక నీటిలో పడిపోవడానికి కారణంగా తెలుస్తోంది.

మారుతున్న పరిస్థితులకు సాంకేతికతే పరిష్కారం

ఎన్ఎస్టీఎల్‌లో జాతీయ సాంకేతిక దినోత్సవం



ఖగేష్‌కుమార్‌కు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం, చిత్రంలో సాజన్

గోపాలపట్నం: మారుతున్న పరిస్థితులను బట్టి సాంకేతికత వృద్ధి చెందాలని, వాటి పురోగతులే సమస్యలకు పరిష్కారాలు అవుతాయని కొచ్చి వాటర్ మెట్రో లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి సాజన్ పి జాన్ అన్నారు. ఎన్ఎస్టీఎల్‌లో సోమవారం జాతీయ సాంకేతిక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి కొచ్చిలో వాటర్ మెట్రో ఎలా ప్రారంభమైంది, విజయవంతంగా అభివృద్ధి చెందిన అంశాలను వివరించారు. ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ కంప్యూటరింగ్ అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. సాంకేతిక పురోగతులను ఉపయోగించుకుంటే దేశాన్ని బలోపేతంగా తయారు చేయవచ్చని, వికసిత భారత్ దార్శనికతను సాకారం చేసుకోవచ్చన్నారు. జాతీయ సాంకేతిక దినోత్సవం చైర్మన్ యుగాంతర్ అడ్వాన్సింగ్ న్యూ టెక్నాలజీ, యాక్సలరేషన్ గురించి వివరించారు. ఈ సందర్భంగా 'థర్మల్ సప్రెషన్ ఆఫ్ గ్యాస్ టర్బైన్ ఎగ్జాస్ట్ ఇన్ కాంపాక్ట్ టన్నెల్ ఆఫ్ వార్‌షిప్' అనే అంశంపై ప్రసంగించిన శాస్త్రవేత్త ఖగేష్ కుమార్ చౌదరిని టైటానియం పతకం, ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ హెచ్.ఎస్.దాస్, డాక్టర్ డి.ఆర్.రాజేశ్వరి, ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ధరలు పెంచి విక్రయిస్తే కఠిన చర్యలు

మహారాణిపేట: భారత్–పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో నిత్యావసర ధరలు పెంచి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయిస్ శాఖ డీఎస్‌వో వి.భాస్కరరావు హెచ్చరించారు.

సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న డీఎస్‌వో కార్యాలయంలో పలు వర్తక సంఘాల నాయకులు, డీలర్లు, ఏజెన్సీలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నిర్దేశించిన ధరలు కన్నా అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పలు వర్తక సంఘాల నాయకులు, వర్తకులు, టోకు వర్తకులు పాల్గొన్నారు.

19న డిప్యూటీ మేయర్ ఎన్నిక

డాబాగార్డెన్స్: మహా విశాఖ నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ పదవికి ఈ నెల 19న ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఫారమ్–2 ప్రకారం ఈ నెల 15లోగా డిప్యూటీ మేయర్ ఎన్నికల షెడ్యూల్‌ను జీవీఎంసీకి ఎన్నికైన సభ్యులకు, ఎక్స్ అఫీషియో సభ్యులకు అందజేయాలని పేర్కొంది.

పల్టీలు కొట్టి గ్రిల్స్‌పైకి దూసుకెళ్లిన కారు


పనోరమ హిల్స్ రోడ్డులో ప్రమాదానికి గురైన కారు

తగరపువలస: ఎండాడ లా కళాశాల రోడ్డులో సోమవారం అతివేగంగా ప్రయాణించిన కారు పల్టీలు కొట్టి సెంట్రల్ గ్రిల్స్ పైకి దూసుకుపోయింది. పనోరమ హిల్స్ నుంచి రుషికొండ వైపు కారుతో ముగ్గురు వెళ్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం చూసేవారికి ఒళ్లు జలదరించేలా ఉన్నా అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి నష్టం జరగలేదు. పీఎం పాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఐ పనితీరు మార్చుకోవాలి


రామచంద్రన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న డీసీఐ చైర్మన్ అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ పనితీరుపై కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రామచంద్రన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విశాఖలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(డీసీఐ) కార్పొరేట్ కార్యాలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీసీఐ వార్షిక పనితీరుపై రామచంద్రన్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. డీసీఐ పనితీరు అసంతృప్తికరంగా ఉందనీ.. కన్సార్టియం పోర్టుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని వ్యాఖ్యానించారు. సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు ప్రయత్నించాలని సూచించారు. డ్రెడ్జింగ్ మార్కెట్‌లో పోటీతత్వం పెరిగిందనీ.. దానికనుగుణంగా పనితీరు మెరుగు పరచుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా నేవిగేషన్ మార్గాల్ని నిర్వహించేందుకు డీసీఐ సహకారం ఎంతో ఉందన్న విషయం ప్రతి ఉద్యోగి, అధికారి గుర్తుపెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఐ, విశాఖ పోర్టు చైర్మన్ డా.అంగముత్తు, డీసీఐ ఎండీ దుర్గేష్‌కుమార్ దూబే ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారత సైనిక నిధికి నెల జీతం

హోంమంత్రి అనిత ప్రకటన

సింహాచలం: భారత సైనిక నిధికి ఒక నెల జీతాన్ని అందిస్తున్నట్టు హోంమంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. సోమవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆమె దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాన్ని ఇన్‌చార్జి ఈవో సుజాత అందజేశారు.